9న విద్యుత్ సరఫరా నిలుపుదల

ప్రజాశక్తి - కాజులూరు

విద్యుత్ సరఫరాలో ఏర్పడుతున్న అవాంతరాలను అధిగమించేందుకు చేపడుతున్న మరమ్మతులు కారణంగా మండలంలో కొన్ని ప్రాంతాల్లో ఈ నెల 9న విద్యుత్ సరఫరాను నిలుపుదల చేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఇఇ జి.ప్రసాద్ తెలిపారు. బుధవారం ఆర్యవటం సబ్ స్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ 33/11 కెవి కాజులూరు సబ్ స్టేషన్‌లో గల 11 కేవి ఫీడర్స్ పరిధిలోని కాజులూరు, ఐతపూడి, తిప్పరాజుపాలెం, శీల ఒంటితాడి గ్రామాలకు విద్యుత్ సరఫరాను నిలుపుదల చేస్తామన్నారు. కావున విద్యుత్ వినియోగదారులు విద్యుత్ శాఖకు సహకరించాలని కోరారు.

ఈసారీ నిరాశే...

- కాటన్ బ్యారేజీ ఆధునికీకరణ హుళక్కే
- వినపడని కోనసీమ రైలు కూత
- బడ్జెట్‌లో జిల్లాకు దక్కని ప్రాధాన్యత

ప్రజాశక్తి - కాకినాడ, రాజమహేంద్రవరం ప్రతినిధులు

ఆర్థిక మంత్రి బుగ్గన ప్రవేశపెట్టిన ఓటాన్ అకౌంట్ బడ్జెట్ మరోసారి జిల్లా వాసులను నిరాశపరిచింది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా విమర్శలు వినిపిస్తున్నాయి. ఎన్నికల నేపథ్యంలో జిల్లాకు అధిక ప్రాధాన్యత ఉంటుందని భావించారు. ముఖ్యంగా పెండింగ్ ప్రాజెక్టులు గాని, ఇరిగేషన్ రంగానికి గాని ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వలేదు. కోనసీమ రైల్వే లైన్‌కు రాష్ట్ర ప్రభుత్వం వాటా చెల్లించాల్సి ఉంది. ఈ సారీ ఈ ప్రాజెక్టుకు నిధుల మాట ఎత్తలేదు. పర్యాటక, పారిశ్రామిక అభివృద్ధిపైనా సారీ అనేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తూనే రాష్ట్ర స్థూల ఉత్పత్తి రేటులో పురోగమనం, పంటల బీమా పథకాన్ని రైతులందరికీ వర్తింపజేయడాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఘనతగా చెప్పుకొన్నారు.గత కేటాయింపులకు సంబంధించి ఈ బడ్జెట్ లో నిధుల వినియోగం ఊసెత్తలేదు. గత బడ్జెట్ లో ఉప్పాడ హార్బర్ పనులకు నిధులను కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. కాని ఈ ప్రాజెక్టుకి ఇప్పటి వరకూ 40 శాతం నిధులనే కేటాయించగా ఈ బడ్జెట్ లో మిగిలిన నిధుల గురించి ప్రస్తావన రాలేదు.

కోటిపల్లి - నర్సాపురం రైల్వే లైను పూర్తి కావడం కోసం కోనసీమ ప్రజానీకం 22 ఏళ్లుగా ఎదురు చూస్తోంది. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం దఫదఫాలుగా రైల్వే బడ్జెట్ ల్లో మొత్తం రూ.1,100 కోట్లు కేటాయించింది. మొత్తం నిర్మాణ వ్యయంలో రాష్ట్ర ప్రభుత్వం 25 శాతం వాటా ఇవ్వాల్సి ఉంది. ఈ నాలుగేళ్ళలో రాష్ట్ర ప్రభుత్వం తన వాటాకు సంబంధించిన నిధులు కేటాయింపు చేయని కారణంగా నిర్మాణ పనులు నిలిచిపోయాయి. సుమారు రూ.350 కోట్లు రాష్ట్ర వాటా ఇవ్వాల్సి ఉంది. అయితే అనేక వినతులు ఇవ్వగా 55 కిలోమీటర్ల పొడవునా ఉన్న ఈ లైన్ కు భూ సేకరణ చేస్తామని అందుకు అయ్యే ఖర్చును భరిస్తామని ప్రభుత్వం రైల్వేకు గతంలోనే తెలిపింది. ప్రస్తుతం భూ సేకరణ నత్తనడకన జరుగుతోందని కోనసీమ వాసులు చెబుతున్నారు. భూ సేకరణ నిధుల కేటాయింపుపై గతంలో ఇచ్చిన హామీ మేరకు ప్రాజెక్టు కొనసాగింపుగా ఈ బడ్జెట్ లో నిధుల మాట ఎత్తలేదు.

ఎక్కడి సమస్యలు అక్కడే

విశాఖ-కాకినాడ మధ్య పెట్రో రసాయనాల పెట్టుబడుల కేంద్రం వస్తుందని కాకినాడ జిల్లా వాసులు ఎప్పటి నుంచో ఎదురు చూస్తున్నారు. కాకినాడ సెజ్‌లో నేటికీ పరిశ్రమల జాడ కనిపించడం లేదు. జిల్లా వాసుల తాగునీటి కష్టాలకు శాశ్వత పరిష్కారం చూపే జల్ జీవన్ మిషన్ పనులకు గత బడ్జెట్‌లో నిధులను కేటాయించినా పనులు నాటి నుంచి ఒక్క అడుగు ముందుకు పడలేదు. జిల్లాలో పలు రహదారుల పనులకు భారీగా సొమ్ములు కేటాయించాల్సి ఉంది. గతంలో నిధులను కేటాయించామని ప్రభుత్వం చెప్పిన నాటి నుంచి ఇప్పటివరకు రహదారుల పరిస్థితి అధ్వాన్నంగానే ఉంది. కాకినాడలో విడుదలయ్యే 50 మిలియన్ లీటర్ల వ్యర్థ జలాలను శుద్ధి చేసేందుకు గతంలో రూ.10 కోట్లు వెచ్చించారు. కానీ నేటికీ నిధులను కేటాయించక పనులు ప్రారంభం కాలేదు. కాకినాడలో సైన్స్ సెంటర్, గోదావరి కళాక్షేత్రం, స్టేడియంలను ఇటీవల హడావుడిగా ప్రారంభించినా ఇంకా బిల్లులు పెండింగులోనే ఉన్నాయని కాంట్రాక్టర్లు గగ్గోలు పెడుతున్నారు.



రైతుల ఆశలు ఆవిరి

రైతుల కోసం రూ.33,300 కోట్లు ఖర్చు చేసినట్లు చెబుతున్న రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలో అత్యంత కీలకమైన ధవళేశ్వరం కాటన్ బ్యారేజ్ గేట్ల ఆధునికీకరణకు చేతులెత్తేసింది. గతేడాది రూ.61 కోట్లు కేటాయించిన విషయం విధితమే. అయితే నిధులు కొరత వల్ల ఈ పనులు నేటికీ ప్రారంభం కాలేదు. బ్యారేజీపై రోడ్డు మరమ్మతులు సైతం చేపట్టకపోవటంతో వాహన చోదకులకు ఇబ్బందులు తప్పలేదు. తాజా బడ్జెట్లోనూ నిధుల కేటాయింపు లేదు. దాదాపు 10 లక్షల ఎకరాలకు బ్యారేజీ నుంచి సాగునీటిని అందిస్తున్నారు. కీలకమైన గేట్ల ఆధునికీకరణను విస్మరించడంతో ఉమ్మడి జిల్లా వాసులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో ఏటా నిర్వహించాల్సిన కాల్వల పూడికతీత పనులు చేపట్టకపోవడంతో గోదావరి వరదలు, అకాల వర్షాలకు రైతులకు పంట నష్టం తప్పడంలేదు. గోదావరిలో ఇసుక పూడిక తీత పనులు చేయడానికి గతంలో టెండర్లు పిలిచారు. కాని బడ్జెట్లో నిధులు కేటాయించలేదు. జాతీయ నదీ పరిరక్షణ ప్రణాళిక (ఎన్‌ఆర్‌సిపి) కింద 'గోదావరి నది కాలుష్య నివారణ, పరిరక్షణ' ప్రాజెక్ట్ కోసం కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ 2022లో రూ.88.43 కోట్లు మంజూరు చేసింది. ప్రాజెక్టు మొత్తం వ్యయం రూ.416 కోట్లుగా అంచనా వేశారు. కాని కేంద్రం రూ.88.43 కోట్లు మాత్రమే మంజూరు చేసింది. ఈ ప్రాజెక్టు పనులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 60:40 నిష్పత్తిలో సంయుక్తంగా చేపట్టాలి. రాష్ట్ర వాటా నేటికీ కేటాయించలేదు. పారిశ్రామిక అభివృద్ధి, ఉపాధి కల్పన ఊసే ఎత్తలేదు. పోలవరం నిర్వాసితులకు ఎకరాకు రూ.5 లక్షల చొప్పున పరిహారం, అలాగే ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ రూ.6.50 లక్షలకు బదులు రూ.10 లక్షల ఇస్తామని ముఖ్యమంత్రి జగన్ గతంలో హామీ ఇచ్చిన ఈ బడ్జెట్లోనూ స్పష్టమైన హామీ ఇచ్చిన దాఖలాలు లేవు. సాగునీటి ప్రాజెక్టులను పూర్తిగా విస్మరించడంతో జిల్లా రైతాంగం తీవ్ర అసహనం వ్యక్తం చేస్తుంది. యువతకు ఉపాధి కల్పించే రంగాన్ని విస్మరించారు. స్థూల ఆదాయంపై అంకెల గారడి వినిపించారు. ఇళ్ల నిర్మాణానికి కేటాయింపులు సాధారణంగానే ఉన్నాయి. ప్రభుత్వం ఇస్తున్న అరకొర సొమ్ములు లబ్ధిదారులు కనీసం పునాదులు కట్టుకోవడానికి కూడా సరిపోని పరిస్థితులు ఉన్నాయి. ఈ బడ్జెట్ లోనైనా తగిన నిధులు కేటాయిస్తారని లబ్ధిదారులు ఆశించి భంగపడ్డారు.

ఇంద్రపాలెం అంబేద్కర్ విగ్రహం సెంటర్లో ధర్నా చేస్తున్న నిరుద్యోగులు

రోడ్డెక్కిన నిరుద్యోగులు

- మెగా డిఎస్‌సిని విడుదల చేయాలి
- డివైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ధర్నా, ర్యాలీ

ప్రజాశక్తి - కాకినాడ

రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 25 వేల పోస్టులతో మెగా డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ నిరుద్యోగులు రోడ్డెక్కారు. డివైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో బుధవారం నగరంలోని ధర్నా చౌక్ వద్ద భారీఎత్తున ధర్నా నిర్వహించారు. అనంతరం ర్యాలీ నిర్వహించి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రమం వద్ద రాష్ట్ర ప్రభుత్వ తీరును ఎండగడుతూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డివైఎఫ్‌ఐ జిల్లా నాయకుడు పాండవులు దుర్గాప్రసాద్ మాట్లాడుతూ ప్రతిపక్ష నాయకుడిగా ఉన్న సమయంలో అధికారంలోకి వచ్చిన వెంటనే ఖాళీగా ఉన్న 23 వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసేందుకు మెగా డిఎస్‌సిని నిర్వహిస్తామని వైఎస్ జగన్మోహన్ రెడ్డి నిరుద్యోగులకు హామీ ఇచ్చారని అన్నారు. అయితే అధికారంలోకి వచ్చిన ఐదేళ్ల కాలంలో ఒక్కసారి కూడా డిఎస్‌సిని తీయకుండా నిరుద్యోగులను మోసం చేశారని అన్నారు. ఎన్నికల ముందు మరోసారి నిరుద్యోగులను మోసం చేసేందుకు కేవలం 6,100 పోస్టులను భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ విడుదల చేస్తామని ప్రకటించడం దారుణమన్నారు. ఇది పూర్తిగా నిరుద్యోగులను మోసం చేయడమేనని విమర్శించారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను 99 శాతం అమలు చేశామని జబ్బలు చరుచుకుంటున్న జగన్మోహన్ రెడ్డి జాబ్ క్యాలెండర్, ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ, 25 వేల ఉపాధ్యాయ పోస్టుల భర్తీ చేయకుండా 99 శాతం హామీలు ఏవిధంగా అమలు చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. దేశంలో మోడీ ప్రభుత్వం నూతన జాతీయ విద్యా విధానాన్ని తీసుకురాగానే దాన్ని రాష్ట్రంలో అమలు చేయడం ద్వారా జీవో నెంబర్ 117 తీసుకొచ్చి 3, 4, 5 తరగతులను హైస్కూల్లో కలిపి ప్రాథమిక పాఠశాలలో ఉండే ఉపాధ్యాయ పోస్టులు అన్ని రద్దు చేశారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే 6,100 పోస్టులతో నిర్వహించే దగా డిఎస్‌సిని ఉపసంహరించుకుని, 25 వేల పోస్టులతో మెగా డిఎస్‌సి నోటిఫికేషన్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం డిఆర్‌ఒ డి.నాయక్‌కు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్‌ఐ నాయకులు టి.రాజా, డిఎస్‌సి అభ్యర్థులు గణేష్, భవాని, రామలక్ష్మి, తులసి, రాజేష్, రామకృష్ణ, మణికంఠ, పావని, సింహాచలం పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై వాహన తనిఖీలు

ప్రజాశక్తి - గండేపల్లి

మండలంలోని రాగంపేట శివారు జాతీయ రహదారిపై పోలీసులు వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఐ ఎస్.రామకృష్ణ మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడిపిన వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. మోటార్ సైకిల్ అతివేగంగా నడుపుతూ అనేక ప్రమాదాలకు కారకులు అవుతున్నారని అన్నారు. ప్రతి ఒక్కరు వాహనం నడిపేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు

భగత్‌సింగ్ విజ్ఞాన కేంద్రం నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - సామర్లకోట

భగత్ సింగ్ విజ్ఞాన కేంద్రం సామర్లకోట నూతన కమిటీ ఎన్నికైంది. స్థానిక కార్యాలయంలో కరణం ప్రసాదరావు అధ్యక్షతన బుధవారం జరిగిన కార్యక్రమంలో నూతన కమిటీ అధ్యక్షులుగా బాలం హరిబాబు, కార్యదర్శిగా చల్లా మహేష్, ఉపాధ్యక్షులుగా టి.నాగమణి, సహాయ కార్యదర్శిగా కరణం గోవిందరాజు, కోశాధికారిగా కరణం ప్రసాదరావు, కార్యవర్గ సభ్యులుగా బాలం శ్రీనివాస్, ఎస్‌కె.ఫాతిమా, కె.వరలక్ష్మి,, విప్పర్తి కొండలరావు, దారభాని కృష్ణ, బాలం సత్తిబాబు ఎన్నికయ్యారు.

ఆయిల్ ఫామ్ సాగుపై అవగాహన పెంచుకోవాలి

ప్రజాశక్తి - పెద్దాపురం

ఆయిల్ ఫామ్ రైతులందరూ సాగు విధానాలపై అవగాహన పెంచుకోవాలని పతంజలి ఫుడ్స్ ప్లానిటేషన్స్ డిజిఎం డి.రవీంద్ర అన్నారు. మండలంలోని రాయ భూపాలపట్నం గ్రామంలో మండల ఉద్యాన శాఖ అధికారి ఎన్.సుజాత అధ్యక్షతన ఆయిల్ పామ్ రైతుల సదస్సు బుధవారం జరిగింది. ఈ కార్య క్రమంలో జిల్లా మైక్రో ఇరిగేషన్ ఆఫీసర్ జివివి.ప్రసాద్ ఉద్యానవన సహాయకులు చిలకమ్మ, సీనియర్ మేనేజర్ కె.వెంకటేశ్వరరావు, ఫీల్డ్ ఆఫీసర్ డిఎల్.వెంకటేశ్వం రావు, రైతులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు విఫలం

ప్రజాశక్తి - కాకినాడ

ఇపిఎఫ్ పెన్షనర్ల సమస్యల పరిష్కారంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం అయ్యాయని సిపిఎం నగర కన్వీనర్ పలివెల వీరబాబు విమర్శించారు. ఇపిఎఫ్ కార్యాలయం వద్ద పెన్షనర్లు చేస్తున్న మూడో రోజు రిలే నిరహరదీక్ష శిబిరాన్ని బుధవారం ఆయన సందర్శించి మద్దతు తెలిపారు. బుధవారం జరిగిన దీక్షలో యూనియన్ నాయకులు కె. సత్తిరాజు, ఆర్. వేదవల్లి, డి.కైలాసగిరి, అవాల శ్రీనివాసు, సిహెచ్.కాశీవిశ్వనాథంలు కూర్చున్నారు. ఈ దీక్షను జిల్లా కార్యదర్శి యుఎస్ఎన్.రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వీరబాబు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వాలు ఉద్యోగుల, ఉపాధ్యాయుల, కార్మికుల, పెన్షనర్ల, ఇపిఎఫ్ పెన్షనర్ల సమస్యలను పరిష్కరించడంలో విఫలం అయ్యాయని అన్నారు. కార్పొరేట్ కంపెనీలకు రాయితీలు కల్పించడంలో చూపుతున్న శ్రద్ధ పెన్షనర్ల సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చూపడం లేదన్నారు. పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి అందరూ ఐక్యంగా ఒకే వేదిక మీదకు వచ్చి పోరాడాలని పిలుపునిచ్చారు. ఎపిఆర్‌పిఎ జిల్లా గౌరవ అధ్యక్షులు అయితాబత్తుల రామేశ్వరరావు మాట్లాడుతూ ఇపిఎఫ్ పెన్షనర్లు అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని అన్నారు. పెరిగిపోయిన ధరల నేపథ్యంలో రూ.వెయ్యితో జీవనం ఏవిధంగా సాధ్యమని ప్రశ్నించారు. కనీస పెన్షన్‌ను రూ.9 వేలకు పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్ర కోశాధికారి సిహెచ్.సత్యనారాయణరాజు మాట్లాడుతూ ఇపిఎఫ్ పెన్షనర్ల సమస్యలతోపాటు వివిధ పరిశ్రమలు, సంస్థల్లో పనిచేస్తున్న ఇపిఎఫ్ ఉద్యోగులకు హయ్యర్ పెన్షన్ కొరకు హయ్యర్ ఆప్షను అందరికీ ఎటువంటి షరతులు లేకుండా అనుమతించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం నాయకులు పివి.రమణ మాట్లాడుతూ నేటికీ రాష్ట్ర ప్రభుత్వం పెన్షనర్లకు పెన్షన్ చెల్లించకపోవడం చాలా శోచనీయమన్నారు. గిరిజన కార్పొరేషన్ సంస్థ నాయకులు డి.కైలాసగిరి మాట్లాడుతూ గిరిజన కార్పొరేషన్‌లో ఉద్యోగులు చాలా ఇబ్బందులు పడి పనిచేసి రిటైర్ అయ్యారని, వారికి కనీస పెన్షన్ అమలు చేయబడటం లేదన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సత్తిరాజు మాట్లాడుతూ దేశంలో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు 8వవేతరణ సవరణ సంఘం నియమించే అవకాశం లేదని కేంద్రం ప్రకటించడం దారుణమన్నారు. ఇపిఎఫ్ పెన్షనర్లకు హెల్త్ కార్డులు మంజూరు చేయాలని, సీనియర్ సిటిజన్‌లకు రైల్వే ప్రయాణాల్లో రాయితీలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బొజ్జ అశోక్, జి.రామకృష్ణరావు, సిహెచ్.కాశీ విశ్వనాథం, బొట్టా సత్యనారాయణ, జి.గోపాలకృష్ణ, బత్తిన భాస్కరరావు, బుంగ ప్రసాదు, పందిరి రామారావు పాల్గొన్నారు.

పెన్షనర్ల దీక్షలో మాట్లాడుతున్న యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్తిరాజు

వెబ్ కాస్టింగ్ విధానంలో పోలింగ్ పరిశీలన

ప్రజాశక్తి - కాకినాడ

2024-సాధారణ ఎన్నికల పోలింగ్‌ను వెబ్ కాస్టింగ్ విధానంలో పరిశీలించడం జరుగుతుందని జిల్లా ఎన్నికల అధికారిణి, కలెక్టర్ డాక్టర్ కృతికాశుక్లా అన్నారు. బుధవారం కలెక్టరేట్ లో జిల్లాలోని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ ఎన్నికల అధికారులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రత్యేక సంక్షిప్త సవరణ ఓటర్ల జాబితా-2024 లోని అంశాలు, మార్పులు చేర్పులు, 18-19 మధ్య వయసున్న యువత ఓటు నమోదు, పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ ఏర్పాటు, ఈ -ఎపిక్ కార్డుల పంపిణీ, ఇవిఎం, వివిప్యాట్‌ల ద్వారా ఓటింగ్ విధానం వంటి అంశాలపై రాజకీయ పార్టీ ప్రతినిధులతో చర్చించి, కాకినాడ పార్లమెంటు స్థానంతో పాటు ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని కోరారు. . జనవరి 22న ప్రచురించిన తుది ఓటరు జాబితాలో జిల్లా వ్యాప్తంగా 15,99,065 మంది ఓటర్లు ఉండగా, ఫిబ్రవరి 06 నాటికి 15,99,985 మంది ఓటర్లుగా నమోదయ్యారని వివరించారు. ఈ సమావేశంలో డిఆర్‌ఒ డి.తిప్పేనాయక్, రాజకీయ పార్టీల ప్రతినిధులు రావూరి వెంకటేశ్వర రావు(వైసిపి), గదులు సాయి బాబా(టిడిపి), ఎం.రాజశేఖర్ (సిపిఎం), పెద్దిరెడ్డి రవికిరణ్ (బిజెపి), సబ్బారపు అప్పారావు(బిఎస్‌పి) వల్లూరి రామ్మోహన్ (కాంగ్రెస్) కలెక్టరేట్ కోఆర్డినేషన్ విభాగాధిపతి ఎఎస్‌ఎన్.రాధికా, కలెక్టరేట్ ఎన్నికల విభాగం డిటి ఎం.జగన్నాథం సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాణపత్రం అందుకున్న గౌరీనాయుడు

ప్రజాశక్తి - పిఠాపురం

ఫిబ్రవరి 5, 6 తేదీల్లో విశాఖ పట్నంలో నిర్వహించిన రెండు రోజుల జాతీయ సదస్సులో యువ సాహితీవేత్త, రచయిత డాక్టర్ కిలారి గౌరి నాయుడు ప్రమాణపత్రం అందు కున్నారు. భారతీయ భాషల్లో విద్య, సాంకేతిక పదజాలం అనే అంశంపై జరిగిన ఈ సదస్సులో ఈ సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ జాతీయ సదస్సులో 'భారతీయ భాషల అభి వృద్ధికి పరిశోధనా సంస్థల కృషి' అనే అంశంపై గౌరీ నాయుడు అతిథి ఉపన్యాసం, పత్ర సమర్పణ చేశారు. ముగింపు సమావేశంలో న్యూఢిల్లీ సిఎస్‌టిటి అసిస్టెంట్ డైరెక్టర్ మెర్సీ, సిఎస్‌టిటి సదస్సు కన్వీనర్ వినోదినిదేవి, జాతీయ సదస్సు సమన్వయకర్త డాక్టర్ పికె.జయలక్ష్మి, సదస్సు సంచాలకులు డాక్టర్ భాస్కర్ సుధ తదితరులు ఆయనకు ప్రమాణ పత్రం అందించి సత్కరించారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు, సాహితీ మిత్రులు, ఆవంత్స సోమ సుందర్ లిటరరీ ట్రస్ట్ కార్యవర్గ సభ్యులు, కవులు, కళాకారులు అభినందనలు తెలిపారు.

పత్రాన్ని అందుకుంటున్న గౌరీనాయుడు

16న గ్రామీణ భారత్ బంద్

ప్రజాశక్తి - సామర్లకోట

ఈ నెల 16న జరిగే గ్రామీణ భారత్ బంద్‌ను జయప్రదం చేయాలని ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు రావులపల్లి రవీంద్రనాథ్ పిలుపునిచ్చారు. స్థానిక విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం భవనంలో బుధవారం సిపిఐ పట్టణ కార్యదర్శి పెద్దిరెడ్డి సత్యనారాయణ అధ్యక్షతన ఎఐటియుసి జిల్లా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పదేళ్లుగా నరేంద్ర మోడీ అనుసరిస్తున్న రైతు, కార్మిక వ్యతిరేక విధానాలు పరాకాష్టకు చేరిన నేపథ్యంలో రైతు సంఘాలు, కేంద్ర కార్మిక సంఘాలు బంద్‌కు పిలుపునిచ్చాయని తలెఇపారు. దేశానికి వెన్నెముక అయిన రైతులను, సంపదను సృష్టిస్తున్న కార్మికులపై కక్ష కట్టినట్లు మోడీ ప్రభుత్వం వ్యవహరిస్తుం దన్నారు. రాబోయే కార్మికులు, రైతులు రాజకీయ నిర్ణయం తీసుకుని 2024లో నరేంద్ర మోడీకి తగిన గుణపాఠం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎపి భవన నిర్మాణ కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు పడాల రమణ, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తాటిపాక మధు, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు తోకల ప్రసాద్, సిపిఐ జిల్లా కార్యదర్శి కామిరెడ్డి బోడకొండ, తదితరులు మాట్లాడారు.

మాట్లాడుతున్న ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు రవీంద్రనాథ్

కార్టూ'నిజం'

చలో విజయవాడను జయప్రదం చేయండి

-సిఐటియు నాయకులు అరెస్టులు, గృహనిర్బంధాలు

ప్రజాశక్తి - యంత్రాంగం

తమ సమస్యల పరిష్కారం కోసం ఆశ కార్యకర్తలు నేడు చలో విజయవాడకు తరలివెళ్లనున్నారు. ఈ నేపథ్యంలోనే ఆశా వర్కర్ల చలో విజయవాడను అడ్డుకునేందుకు ప్రభుత్వం సన్నద్ధం అయ్యింది. **సామర్లకోట** పట్టణంలోని సిఐటియు జిల్లా కార్యదర్శి బాలం శ్రీనివాసును బుధవారం తెల్లవారుజామున అరెస్టు చేసి సామర్లకోట పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అలాగే వికె రాయపురంలో ఆశ వర్కర్స్ యూనియన్ నాయకురాలు గ్రేస్‌ను పోలీసులు గృహ నిర్బంధం చేశారు. అక్రమ అరెస్టులను సిఐటియు ప్రధాన కార్యదర్శి ఎన్.సురేష్, ఉపాధ్యక్షులు కరణం ప్రసాదరావు, నాయకులు టి.నాగమణి, బాలం సత్తిబాబు, కరణం గోవిందరాజు ఖండించారు. **పెద్దాపురం** సిఐటియు నాయకుడు దారపురెడ్డి క్రాంతి కుమార్‌కు పెద్దాపురం పోలీసులు మంగళవారం అర్ధరాత్రి 12 గంటలకు నోటీసు ఇచ్చి హౌస్ అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా క్రాంతికుమార్ మాట్లాడుతూ పోలీసులు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని విమర్శించారు. **కాకినాడ రూరల్** మండలంలోని పండూరు పిహెచ్‌సి వద్ద కరపత్రం ఆవిష్కరణ కార్యక్రమం జరిగిది. ఈ సందర్భంగా కాకినాడ రూరల్ కార్యదర్శి టి.రాజా, నాయకులు ఎం.వెంకటరమణ మాట్లాడుతూ ఆశలకు కనీస వేతనం ఇవ్వాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్, ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గత నాలుగున్నర సంవత్సరాలుగా అనేక రూపాల్లో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేదన్నారు. నేడు జరిగే చలో విజయవాడ కార్యక్రమంలో ఆశలు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

కాకినాడ రూరల్‌లో కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఆశ కార్యకర్తలు

స్టేషన్లో బాలం శ్రీనివాస్

క్రాంతికుమార్‌కు నోటీసు ఇస్తున్న పోలీసులు

ఆశ యూనియన్ నాయకురాలిని గృహ నిర్బంధం చేసిన పోలీసులు

పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలు వేయాలి

ప్రజాశక్తి - గండేపల్లి, యు.కొత్తపల్లి

గండేపల్లి మండలంలో ప్రతి ఒక్క చిన్నారికి, విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేయాలని వైద్యాధికారి నరేష్ తెలిపారు. ఈ నెల 9న జరిగే జాతీయ నులిపురుగు నివారణ దినోత్సవం సందర్భంగా బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో 'జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమం' గోడపత్రిక, కరపత్రాన్ని ఎంపిపి చల్లగళ్ళ దొరబాబు చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నులి పురుగుల వల్ల రక్తహీనత, పోషక లోపం, ఆకలి మందగించడం, నీరసం, ఆందోళన, కడుపునొప్పి, వికారం, వాంతులు, విరోచనాలు, బరువు తగ్గడం వంటి సమస్యల భారిన పిల్లలు పడే ప్రమాదం ఉందన్నారు. కావున అంగన్‌వాడీ సెంటర్‌లోని చిన్నారులతో పాటు, ఒక సంవత్సరం నుంచి 19 సంవత్సరాలలోపు పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలను వేయాలని, మండలం లో 6875 మందిని ఇందుకు గుర్తించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ బికెఎస్ఎస్.రామన్, ఎంఇఒ కెహెచ్.నాయక్, ఇఒపిఆర్‌డి మూర్తి, తదితరులు పాల్గొన్నారు. **యు. కొత్తపల్లి** మండలంలో చిన్నారులు, 19 సంవత్స రాలలోపు యువతీ, యువకులు నులిపురుగుల భారిన పడకుండా ఉండేందుకు మందులను పంపిణీ చేయనున్నట్లు ఎంపిడి నారాయణ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇందుకు సంబంధించిన గోడపత్రిక ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్య క్రమంలో వైఉద్యులు రిచాశర్మ, సుష్మ, పాల్గొన్నారు.

గోడపత్రికను ఆవిష్కరిస్తున్న ఎంపిపి, ఇతర అధికారులు

పని ఒత్తిడి ఎక్కువ..జీతాలు తక్కువ

- సంక్షేమ పథకాలకు దూరం
-నిరంతరం రాజకీయ వేధింపులే
- నేడు ఆశాలు 'చలో విజయవాడ'

ప్రజాశక్తి – కాకినాడ ప్రతినిధి

ప్రజల ఆరోగ్య పరిరక్షణ బాధ్యతలు చూస్తూ మాతా శిశు మరణాలు తగ్గించడంకోసం కీలక పాత్ర పోషిస్తున్న ఆశా వర్కర్లు సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నారు. గత నాలుగున్నర ఏళ్లుగా వైసిపి ప్రభుత్వం పరిష్కరిస్తుందని ఆశగా ఎదురు చూసినా ఫలితం లేకపోవడంతో ఆశాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కనీస వేతనాలు అమలు చేయాలని, రాజకీయ వేధింపులు నిలుపుదల చేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలనే తదితర డిమాండ్ల సాధనకు గురువారం చలో విజయవాడ కార్యక్రమానికి పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో జిల్లా ఆశ వర్కర్స్ యూనియన్ నాయకులు, పలువురు కార్యకర్తలను ప్రభుత్వ ఆదేశాలతో పోలీసులు ఎక్కడికక్కడ అరెస్టు చేసి అక్రమంగా నిర్బాంధాన్ని ప్రయోగిస్తున్నారు.

కాకినాడ, తూర్పుగోదావరి, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాల్లో 3 వేల 200 మంది ఆశ కార్యకర్తలు పనిచేస్తున్నారు. నిరంతరం ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం పనిచేస్తున్న ఆశాలకు కనీస వేతనం కరువైంది. ప్రస్తుతం పెరుగుతున్న ధరలకు హద్దు లేకుండా పోతుంది. నిత్యవసరాల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. కూరగాయలు రేట్లు దిగిరానంటున్నాయి. పెట్రోలు, డీజిల్, గ్యాస్ ధరల భారం పేదలపై ఎక్కువగా ఉంది. మరోవైపు విద్యుత్ ఛార్జీల పెంపు ఇతర భారాలు ఆశలపై కూడా పడ్డాయి. ఈ నేపథ్యంలోనే కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని వారు కోరుతున్నారు. పనికి తగ్గ జీతాలు లేక అల్లాడుతుంటే ప్రభుత్వం పట్టించుకోవడం లేదని మండిపడుతున్నారు.

కాకినాడ రామారావు పేటలోని ఓ కళ్యాణ మండపంలో పోలీసులు నిర్బంధంలో ఉన్న ఆశా వర్కర్లు

రూ.10 వేలు వేతనం ఇస్తున్నామని గొప్పగా చెబుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను నిలిపివేయడం దారుణమని తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇచ్చే అరకొర వేతనం కనీసం ఇంటి అద్దెలకు కూడా సరిపోవడం లేదని చెబుతున్నారు. పిల్లల ఫీజులు, పెరిగిన ధరలను అధిగమించి కుటుంబాలను పోషించుకోవాలంటే కష్టంగా మారిందని ఆందోళన చెందుతున్నారు. కోవిడ్ కాలంలో ప్రాణాలకు తెగించి సేవలు అందేలా మాపై ఒత్తిడి తీసుకొచ్చినా అనారోగ్యాలకు సైతం గురై పని చేసామని అయితే తగిన గుర్తింపు లేదని వాపోతున్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ సక్రమంగా అమలు చేయడం లేదని కావునా రూ.5 లక్షలు ఇవ్వాలని, రిటైర్డ్ అయిన వారి, మరణించిన వారి కుటుంబాలకు అర్హులైన వారిని ఆశా వర్కర్లుగా తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఇలా అనేకంగా ఉన్న తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతున్నారు. రాజకీయ వేధింపులతో నిత్యం సతమతమవుతున్నామని, స్థానిక నాయకుల జోక్యం లేకుండా తమ పని చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

అక్రమంగా గృహ నిర్బంధం

రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా చలో విజయవాడకు పిలుపునిచ్చిన నేపథ్యంలో జిల్లాలో సిఐటియు, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులను పోలీసులు రెండు రోజులు ముందు నుంచే అక్రమంగా గృహ నిర్బంధం చేశారు. సిఐటియు జిల్లా కార్యదర్శి బాలం శ్రీనివాస్‌ను సామర్లకోటలో తెల్లవారుజామున 5 గంటలకు ఇంటికి వెళ్లి స్టేషన్‌కు తరలించి సాయంత్రం వరకు ఉంచారు. సామర్లకోట మండలం వేట్లపాలెం సబ్ సెంటర్లో పనిచేస్తున్న గౌసి అనే ఆశా కార్యకర్తను వికెరాయపురంలో ఆమె ఇంటి వద్ద నుంచి ఉదయం తీసుకువెళ్లి మధ్యాహ్నం వరకూ సెంటర్లోనే ఉంచి తర్వాత పోలీస్ స్టేషన్‌కు తరలించారు. శరభవరంలో సత్యా అనే ఆశా వర్కర్ ఇంటిని చుట్టుముట్టిన పోలీసులు నోటీసులు ఇచ్చి అక్కడే నిర్బంధించారు. కిర్లంపూడిలో రమణమ్మ అనే ఆశ ఇంటివద్ద బయటకు కదలకుండా పోలీసులు పహారా కాశారు. ఏలేశ్వరం నుంచి చలో విజయవాడ బయలుదేరిన ఐదుగురు వర్కర్లను మార్గం మధ్యలో అడ్డుకుని పోలీస్ స్టేషన్లో ఉంచారు. కాకినాడలో పోర్టు పోలీస్ స్టేషన్‌లో టికెట్లు తీసుకుని రైలు ఎక్కిన సుమారు 30 మందిని అడ్డుకుని రామారావుపేట కళ్యాణ మండపంలో నిర్బంధించారు. సాయంత్రం వరకూ ఉంచి ఆ తర్వాత విడిచి పెట్టారు.

నేరాలు ఘోరాలు

నకిలీపత్రాల కేసులో 8మందికి జైలు

ప్రజాశక్తి – కాకినాడ

నకిలీ పత్రాలు సృష్టించి కాకినాడ మున్సిపాలిటీలో కారుణ్య నియామకం పొందిన మహిళకు, ఆమె కుటుంబ సభ్యులకు, అందుకు సహకరించిన మున్సిపల్ ఉద్యోగులకు మొత్తం 8 మందికి కాకినాడ రెండవ అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ 3 సంవత్సరాల జైలు శిక్ష, 5 వేల రూపాయల జరిమానా విధించారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను రెండవ పట్టణ లా అండ్ ఆర్డర్ పోలీస్ స్టేషన్ ఎస్‌సిహెచ్‌ఒఓ ప్రకటనలో విడుదల చేశారు. 2012వ సంవత్సరంలో కాకినాడ మున్సిపాలిటీలో ఉద్యోగం చేస్తున్న రేచర్లపేటకు చెందిన కోల్లాబత్తుల వెంకటరమణ అనారోగ్యంతో చనిపోయాడు. అయితే అతని భార్య కొల్లాబత్తుల అరుణ కుమారి జీవనోపాధి నిమిత్తం విదేశాలకు వెళ్లింది. దీంతో ఆమె అత్త, కుటుంబ సభ్యులు అందరు ఏకమై అరుణకుమారి తోటికోడలు కోల్లాబత్తుల లక్ష్మిని అరుణకుమారిగా నకిలీపత్రాలను సృష్టించారు. ఆ పత్రాల ద్వారా కాకినాడ మున్సిపాలిటీలో కారుణ్య నియామకంలో ఉద్యోగంలో చేరింది. మృతిడు వెంకటరమణ కుటుంబానికి రావాల్సిన రాయితీలు అన్ని లక్ష్మి నే తీసుకుంది. అయితే విదేశాల నుంచి తిరిగి వచ్చిన అరుణకుమారి జరిగిన వ్యవహారం అంతా తెలుసుకుని పూర్తి ఆధారాలతో టూ టౌన్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీనిపై పోలీసులు నమోదు చేసిన కేసులో విచారించి ఈ కేసులో ముద్దాయిలుగా గుర్తించిన కొల్లాబత్తుల అప్పయ్యమ్మ, కొల్లాబత్తుల లక్ష్మి, కొల్లాబత్తుల గోపి, కొల్లాబత్తుల శ్రీనివాసరావు, కొల్లాబత్తుల శారద, కిలీమి వీర రాఘవరెడ్డి, నీలాపు రమణ, సాడి సత్యనారాయణలను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చారు. ఈ కేసున విచారించిన కాకినాడ 2వ అదనపు జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ ఎం.ప్రసన్నలక్ష్మి ముద్దాయిలపై నేరం రుజువుకావడంతో ఒక్కొక్కరికి 3 సంవత్సరాలు కఠిన కారాగార శిక్షతోపాటు ఒక్కొక్కరికి రూ.5 వేలు చొప్పున జరిమానా విధించారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

ప్రజాశక్తి – పిఠాపురం

పట్టణంలోని స్థానిక పాదగయ కూడలి వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందింది. యు కొత్తపల్లి మండలం కొత్త మూల పేటకు చెందిన భార్యాభర్తలు సిహెచ్ నాగేశ్వరరావు, అపర్ణ ద్విచక్ర వాహనంపై కాకినాడ నుంచి స్వగ్రామానికి వస్తుండగా పాదగయ జంక్షన్ వద్ద మలుపు తిరిగే క్రమంలో వీరిని ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో అపర్ణ(35) అక్కడి కక్కడే మృతి చెందింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పిఠాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గాయపడిన యువకుడు మృతి

ప్రజాశక్తి–మండపేట

ప్రమాదవశాత్తు కాలుజారి మండలంలోని ఏడిద గ్రామానికి చెందిన యువకుడు మృతి చెందాడు. బుధవారం రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు ఎలా ఉన్నాయి. ఏడిద గ్రామానికి చెందిన సిద్ధంతపు రవి (27) తాపేశ్వరంలోని రైస్ మిల్లులో కూలీగా పనిచేస్తున్నాడు. మంగళవారం ఉదయం రైస్ మిల్‌లో పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు జారి పడడంతో తలకు బలమైన గాయమైంది. అతడిని స్థానికులు రాజమహేంద్రవరం ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మతుని బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్ఐ చైతన్యకుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జగన్ పాలనలో బిసిలకు ద్రోహం

ప్రజాశక్తి – తాళ్లరేవు

వైసిపి అధినేత జగన్మోహన్ రెడ్డి పాలనలో బిసిలకు ద్రోహమే జరిగిందని టిడిపి నాయకులు ధ్వజమెత్తారు. స్థానిక టిడిపి కార్యాలయంలో బుధవారం జయహో బిసి సభ జరిగింది. ఈ సభలో మాజీ ఎంఎల్ఎలు వనమాడి కొండబాబు, దాట్ల సుబ్బరాజు, చెల్లి వివేకానంద, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ పితాని బాలకృష్ణ తదితరులు పాల్గొని మాట్లాడారు. గత ఎన్నికల్లో బిసిలకు మాయమాటలు చెప్పిన జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చాక మొండి చేయి చూపారని అన్నారు. బిసి నాయకుడు జిత్తుగ శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో టిడిపి, జనసేన పార్టీల నాయకులు గుత్తుల సాయి, బొంతు గంగాధర్, పెశ్చెట్టి చంద్రమౌళి, నాగిడి నాగేశ్వరరావు, వాడ్రేవు వీరబాబు పాల్గొన్నారు.

'ఉజ్వల' కనెక్షన్ల పంపిణీ

ప్రజాశక్తి – జగ్గంపేట

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉజ్వల ఉచిత గ్యాస్ పంపిణీ కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి ఒమ్మి బిందుమాధవి పాల్గొని లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైసిపి నాయకుడు ఒమ్మి రఘురామ్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేదల మేలు కోసం ఎన్నో పథకాలు ప్రవేశ పెట్టాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి గొల్లపల్లి శ్రీనివాస్, వైసిపి సేవాదళ్ కన్వీనర్ కిలపర్తి వీరబాబు, నీలపల్లి అప్పారావు, రెడ్డి బాను ప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు అభినందనలు

ప్రజాశక్తి – తాళ్లరేవు

ఆడుదాం ఆంధ్ర పోటీల్లో ప్రతిభను కనబరిచిన గాడిమొగ పంచాయతీ క్రీడాకారులను ప్రజా ప్రతినిధులు, అధికారులు అభినందించారు. గాడిమొగ పంచాయతీ నుంచి కో కో, (మెన్ అండ్ ఉమెన్) కబడ్డి (ఉమెన్) టీమ్ సభ్యు లందరు విశేష ఆటతీరుతో నియోజకవర్గ స్థాయిలోను, జిల్లా స్థాయిలోను విజయాలు సాధించి గాడిమొగ ప్రత్యేకతను చాటారని పంచాయతీ కార్యదర్శి విజెవి.రమణ అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కామాడి గోవలక్ష్మి, ఉపసర్పంచ్ కె.లోకేష్ వార్డు సభ్యులు, పాల్గొన్నారు.

కుల ధృవీకరణ పత్రాలు ఇవ్వాలి

ప్రజాశక్తి – సామర్లకోట

తోలుబొమ్మలాట కుటుంబాలకు కుల ధృవీకరణ పత్రాలను మంజూరు చేయాలని పలు కుటుంబాలు కోరాయి. ఈ మేరకు బుధవారం డిప్యూటీ తహశీల్దార్ ఆర్.శ్రీనివాస్‌కు తోలుబొమ్మలాట కుటుంబాలు వినతి పత్రం అందజేశాయి. ఈ సందర్భంగా తోలుబొమ్మలాట వత్తి కళాకారుల సమైక్య రాష్ట్ర అధ్యక్షులు అనపర్తి ఏడుకొండలు మాట్లాడుతూ రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో తోలుబొమ్మలాట కళాకారులు నివసిస్తున్నారని అన్నారు. ప్రభుత్వ జిఒ ప్రకారం కులధృవీకరణ పత్రాలను ఇవ్వడంలో స్థానిక అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వ జిఒను అనుసరించి కుల ధృవీకరణ పత్రాలు ఇవ్వాలని కోరారు.

10,11,12 తేదీల్లో ప్రజ్ఞ వికాసం పరీక్ష

ప్రజాశక్తి – పెద్దాపురం

యుటిఎఫ్, ఎస్ఎఫ్ఐ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 10, 11, 12 తేదీల్లో ప్రజ్ఞావికాసం పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి వై.గోపాలకృష్ణ తెలిపారు. బుధవారం పెద్దాపురం మండలం కాండ్రకోట గ్రామంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి త్రిమూర్తులు ఆధ్వర్యంలో ఈ పరీక్షలకు సంబంధించి గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సం దర్భంగా గోపాల కృష్ణ మాట్లాడుతూ ప్రజ్ఞావికాసం పరీక్షలో తెలుగు 10 మార్కులు, ఇంగ్లీష్ 20 మార్కులు, లెక్కలు 20 మార్కులు, సోషల్ 20 మార్కులు, ఎస్ఎస్ 10 మార్కులు, పిఎస్ 10 మార్కులు, హిందీ 10 మార్కులు ఉంటా యన్నారు. ఈ పరీక్షల్లో పాల్గొనడం ద్వారా 10వ తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఏవిధంగా పరీక్ష రాయవచ్చునేది తెలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల కమిటీ సభ్యుడు బి.జగదీష్ పాల్గొన్నారు..

రెమ్యూనరేషన్‌ను పెంచాలి

ప్రజాశక్తి – పెద్దాపురం

ఇన్విజలేటర్ డ్యూటీలు, పేపర్ వాల్యుయేషన్, ప్రాక్టికల్స్‌కు చెల్లించే రెమ్యునరేషన్‌ను పెంపుదల చేయాలని ఎయిడెడ్ కాలేజెస్ పార్ట్ టైం లెక్చరర్స్ యూనియన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు నన్నయ యూనివర్శిటీ రిజిస్ట్రార్ సుధాకర్‌ను యూనియన్ జాయింట్ సెక్రెటరీ ఎన్‌వి.లక్ష్మి డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని బుధవారం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెమ్యునరేషన్, ప్రాక్టికల్ రెబ్యునరేషన్ చాలా కాలం నుంచి పెంపుదల చేయడం లేదన్నారు. తమ డిమాండ్ల పట్ల రిజిస్ట్రార్ సానుకూలంగా స్పందించారన్నారు.

యానాం వార్తలు

మీడియాతో మాట్లాడుతున్న ఎస్‌పి రఘునాయిగం

యానాం ప్రజల సహకారం మరువలేను

ప్రజాశక్తి – యానాం

యానాం ప్రజలు అందించిన సహకారాన్ని ఎన్నడూ మరువలేనని పుదుచ్చేరికి బదిలీపై వెళ్తున్న ఎస్‌పి రఘునాయిగం అన్నారు. స్థానిక ఎస్‌పి కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. యానాం ఎస్‌పిగా బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి నేటి వరకూ నియోజకవర్గంలో శాంతిభద్రతలకు భంగం వాటిల్లకుండా ప్రజలు ఎంతగానో సహకరించారని అన్నారు. యానాం ప్రాంతం, ప్రజలు తనకు ఎంతో సంతృప్తిని ఇచ్చేలా సహాయ, సహకారాలు అందించారని సంతోషం వ్యక్తం చేశారు. తన విధి నిర్వహణలో సంపూర్ణ సహకారం అందించిన రాజకీయ నాయకులు, ప్రజలు, పోలీసు అధికారులు, సిబ్బంది, ఇతర ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బందికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

సిఎంను కలిసిన డైలీ రేటెడ్ ఉద్యోగులు

సిఎంతో మాట్లాడుతున్న యూనియన్ నాయకులు

ప్రజాశక్తి – యానాం

యానాంలో వివిధ ప్రభుత్వ శాఖల్లో డైలీ రేటెడ్ ఎంప్లాయిస్‌గా పని చేస్తున్న సిబ్బంది ముఖ్యమంత్రి రంగస్వామిని పుదుచ్చేరి ఎంప్లాయిస్ యూనియన్ ప్రతినిధులు అధ్వర్యంలో బుధవారం కలిశారు. ఈ సందర్భంగా వివిధ శాఖల్లో ఉన్న హౌస్ కీపింగ్, వాచ్‌మెన్ పోస్టులను వెంటనే పర్మినెంట్ చేయాలని కోరినట్లు తెలిపారు. సిఎం సానుకూలంగా స్పందించారని త్వరలో పర్మినెంట్ చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిపి అండ్ ఎఆర్ సెక్రటరీ కేశవన్, పుదుచ్చేరి ఎంప్లాయిస్ యూనియన్ సభ్యులు సెల్వం, రాజేంద్రన్, మురుగవేల్, ఆనంద రాజన్, సుమిత్ర తదితరులు పాల్గొన్నారు.

టిడిపిలోకి మురారి సర్పంచ్, ఉప సర్పంచ్

పార్టీలో చేరిన వారితో జ్యోతుల నెహ్రూ

ప్రజాశక్తి – గండేపల్లి

మండలంలోని వైసిపికి చెందిన మురారి గ్రామ సర్పంచ్ కుక్కల ఆనంద్‌బాబు, ఉప సర్పంచ్ జాస్తి వసంత్ ఆ పార్టీకి రాజీనామా చేసి టిడిపిలో చేరారు. ఆయనతో పాటు, నియోజకవర్గ వైసిపి యూత్ ప్రెసిడెంట్, గ్రామ ఉప సర్పంచ్ జాస్తి వసంత్, పలువురు వార్డు సభ్యులు తమ తమ అనుచరులతో నియోజక వర్గ టిడిపి ఇన్‌ఛార్జ్ జ్యోతుల నెహ్రూ సమక్షంలో 1000 మంది వరకూ టిడిపిలో చేరారు. వీరిందరికీ టిడిపి జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్, నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ జ్యోతు ల నెహ్రూ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ముందుగా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, కేరళ వాయిద్యా లతో, బాణా సంచా కాల్పులతో, తీన్ మార్ డప్పులతో, భారీ ఊరేగింపు నిర్వహించి జ్యోతుల నెహ్రూకు ఘన స్వాగతం పలికారు. వారికి జగమాలతో సత్కరించారు. ఎన్‌టిఆర్, కందుల కొండయ్యదొర విగ్రహాలకు ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఆనంద్‌బాబు, ఉప సర్పంచ్ జాస్తి వసంత్ మాట్లాడుతూ జ్యోతుల నెహ్రూ గెలుపు కోసం శక్తి వంచన లేకుండా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కోర్పు లచ్చయ్యదొర, ఎస్‌విఎస్.అప్పలరాజు, పోతుల మోహనరావు, సుంకవల్లి రాజు, మారిశెట్టి భద్రం, అడబాల భాస్కరరావు, కందుల చిట్టిబాబు, కోర్పు సాయి తేజ, ఆళ్ల గోవిందు, పాల్గొన్నారు.

మహిళల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి – రౌతులపూడి

మహిళల అభివృ ద్ధే ప్రభుత్వ ధ్యేయం అని ప్రత్తి పాడు నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జ్ వరుపుల సుబ్బారావు అన్నారు స్థానికంగా బుధ వారం డ్వాక్రా సంఘాలకు ఆసరా చెక్కులు పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా 7,990 మంది డ్వాక్రా సభ్యులకు ఐదు కోట్ల 18 లక్షల రూపాయల మెగా చెక్కును ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి గొల్లు లక్ష్మణమూర్తి, వైసిపి రాష్ట్ర నాయకులు వాసిరెడ్డి జమీలు, వైస్ ఎంపిపి తిరుమల రాయలు, డిసిసిబి డైరెక్టర్ పులి మధు, వాసిరెడ్డి భాస్కర్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ల వేగవంతానికి ఆదేశం

ప్రజాశక్తి – పెద్దాపురం

పెద్దాపురం డివిజన్ పరిధిలోని అన్ని సచివాలయాల్లో నవరత్నాలు, అందరికీ ఇల్లు లబ్ధిదా రులకు ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ వేగవంతం చేయాలని పెద్దాపురం డివిజనల్ పంచాయతీ అధికారి బాలామణి అన్నారు. మండల పరిధిలోని ఆర్‌బి కొత్తూరు, రాయ భూపాలపట్నం పంచాయతీల పరిధిలోని సచివాలయాల్లో ఇఒసిఆర్‌డి కె.రాజశేఖర్‌తో కలిసి ఆమె ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీల కార్యదర్శులు ఫణి కుమార్, జ్యోతుల పద్మరాజు, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

దాతల సాయాన్ని ఉపయోగించుకోవాలి

ప్రజాశక్తి – కాజులూరు

దాతలు అందిస్తున్న ప్రోత్సాహాన్ని సద్వినియోగం చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపల్ ఎస్ఎస్.శ్రీనివాస్ సూచించారు. బుధవారం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో లైబ్రేరియన్ విళ్ళ భీమేశ్వరరావు మిత్రులు హైదరాబాద్ చెందిన జామి రామకృష్ణ ఇంటర్లో ప్రతిభ కనబరిచిన కేత వేణు, టేకుమూడి బిందుశ్రీ, పోతురాజు ప్రపూర్ణ, పెంకె కుసుమ, తిరంశెట్టి ఆదిలక్ష్మి, ద్రోణాద్రి హేమలక్ష్మి, కుడుపూడి పార్థసారథి, సలాది కృష్ణవేణిలకు రూ.1500 చొప్పున ప్రోత్సాహ నగదు బహుమతిని ప్రిన్సిపల్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాతలు అందిస్తున్న సాయాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని అన్నారు.

NOTICE

Under the instructions from my Client Bank of Baroda, Main branch, Rajahmundry represented by its chief Manger **PALLA SAI SAGAR,** S/o. Vasudevarao, The general Public are hereby Informed as follows:

That my client's branch was shifted from D.No. 31-1-40, Ajantha Hotel Building, Main Road Rajahmundry to the present premises bearing D.No. 6-1-8, Pushkar Ghat, Rajahmundry on **23.12.2022.** that thereafter, it is noticed by my client that the original of Doc No. **6289 of 2001** dated **07-12-2001** of the office District registrar, Rajahmundry executed by Jatla_Bhimaraju in favour of **DONTHAMSETTI KIRAN KUMAR** and Original of Doc **6288 of 2001** dated **07.12.2001** of the office of District Registrar, Rajahmundry executed by **Jatla Bhimaraju** in favour of **Mavuri Malleswari** were lost during transit.

That the General public at large is hereby informed that if anyone finds the original documents as aforesaid, they are hereby requested to return the same to my client.

MYLAVARAPU SRIKANTH
Rajahmundry Advocate
06-02-2024 Rajahmundry-533104

ఒపిఎస్‌ను అమలు చేయాలి

గోడపత్రికను ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు

ప్రజాశక్తి – కిర్లంపూడి

పాత పెన్షన్ విధానాన్ని పునరు ద్ధరించాలని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి బాలిన నూకరాజు డిమాండ్ చేశారు. ఓట్ ఫర్ ఒపిఎస్ అంటూ పాత పెన్షన్ విధానం పునరుద్ధరణ రాజకీయ అజెండా కావాలని ఆకాంక్షిస్తూ రూపొందించిన గోడపత్రికను మండలంలోని తామరాడ జడ్‌పి ఉన్నత పాఠశాలలో యుటిఎఫ్ నాయకులు బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ప్రతిపక్ష నాయకుడిగా ఉన్న వైఎస్ జగన్మో హన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లో సిపిఎస్ రద్దు చేస్తానని హామీ ఇచ్చా రని, అయితే ముఖ్యమంత్రి పదవిని అధిష్టించి ఐదేళ్లు కావస్తున్నా ఆ హామీని అమలు చేయలేదని అన్నారు. రాష్ట్ర ప్రభు త్వం కొత్తగా తీసుకువచ్చిన జిపిఎస్ వల్ల ఎటువంటి ఉపయో గం లేదన్నారు. రాబోయే ఎన్నికల్లో ఒపిఎస్ సాధన అజెండా చేయా లని అన్ని రాజకీయ పక్షాల నాయకులను కోరుతున్నా మన్నారు. రాష్ట్ర యుటిఎఫ్ సంఘం పిలుపుమేరకు ఓట్ ఫర్ ఒపిఎస్ నినాదాన్ని ఉద్యోగుల్లోకి తీసుకెళ్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ మండల అధ్యక్షుడు ఆర్ఎంఎన్‌బి.కుమార్, వీర్రాజు, కస్తూరిబాయి, రామ్మోహన్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

స్వామి నాయుడు మృతికి సంతాపం

చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దవులూరి దొరబాబు, తదితరులు

ప్రజాశక్తి – సామర్లకోట

స్థానిక మున్సిపల్ చైర్ పర్సన్ గంగిరెడ్డి అరుణకృష్ణమూర్తి మామ గంగిరెడ్డి స్వామి నాయుడు మృతికి పలువురు సంతాపం తెలిపారు. స్థానిక వీరరాఘవపురంలో స్వామినాయుడు జ్ఞాపకార్థ కార్యక్రమం బుధవారం ఆయన స్వగృహం వద్ద జరిగింది. ఈ కార్యక్రమంలో పెద్దాపురం నియోజకవర్గం వైసిపి ఇన్‌ఛార్జ్ దవులూరి దొరబాబు, పట్టణానికి చెందిన పలువురు ప్రముఖులు, కౌన్సిలర్‌లు, పలు పార్టీల నాయకులు పాల్గొని స్వామి నాయుడు చిత్రపటానికి నివాళులర్పించారు.

9 నుంచి పీఠం 96వ వార్షిక మహాసభ

ప్రజాశక్తి – పిఠాపురం

ఫిబ్రవరి 9, 10, 11 తేదీల్లో పిఠాపురంలోని విశ్వవిజ్ఞాన విద్య ఆధ్యాత్మిక పీఠం 96వ వార్షిక మహాసభలు నిర్వహించనున్నట్లు పీఠాధిపతి డాక్టర్ ఉమర్ ఆలీషా తెలిపారు. బుధవారం పీఠం నూతన ఆశ్రమం వద్ద ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 1472వ సంవత్సరంలో స్థాపించబడిన విశ్వవిజ్ఞాన విద్య ఆధ్యాత్మిక పీఠం 552 సంవత్సరాలుగా దేశ సమగ్రత విశ్వమానవ శాంతి కొరకు పాటుపడుతోందన్నారు. మూడు రోజులపాటు జరిగే మహాసభల్లో పీఠం యొక్క ఆశయాలు ప్రతిబింబించేలా 28 స్టాల్స్‌ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పీఠం కన్వీనర్ పేరూరు సూరిబాబు, ఎవివి.సత్యనారాయణ, పింగళి ఆనంద్ కుమార్, సలాది రమేష్, పీఠం మీడియా కన్వీనర్ ఆకుల రవితేజ పాల్గొన్నారు.

'తేల్చుకోలేని స్థితిలో టిడిపి, జనసేన'

ప్రజాశక్తి –జగ్గంపేట

రాబోయే ఎన్నికలకు రెండు నెలల వ్యవధి మాత్రమే ఉందని, నేటికీ అభ్యర్థులను తేల్చుకోలేని స్థితిలో టిడిపి, జనసేన పార్టీలు ఉన్నాయని వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ తోట నరసింహం ఎద్దేవా చేశారు. మండలంలోని జె. కొత్తూరు గ్రామంలో బుధవారం వైసిపి ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని అన్నారు. జగ్గంపేట నియోజకవర్గంలో వైసిపి అభ్యర్థి విజయం సాధిస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నకిరెడ్డి నాగేశ్వరావు, వైసిపి నాయకులు తోట రాంజీ, ఒమ్మి రఘురాం, అత్తులూరి సాయిబాబు, పాల్గొన్నారు.

9న విద్యుత్ సరఫరా నిలుపుదల

ప్రజాశక్తి – తాళ్లరేవు

ఈనెల 9న మండలంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు కాకినాడ ఇఇ జి.ప్రసాద్ తెలిపారు. శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు మండలంలో 33/11 కెవి పరిధిలోని తాళ్లరేవు, పి.మల్లవరం, జార్జిపేట, గాడిమొగ, భైరవపాలెం, పోలేకుర్రు పంచాయతీల పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు తెలిపారు.

భీష్మ ఏకాదశి ఏర్పాట్లపై సమీక్ష

ప్రజాశక్తి – అన్నవరం

అన్నవరం వీర వెంకట సత్యనారాయణ స్వామి దేవస్థానం రత్నగిరి కొండపై ఈనెల 20న నిర్వహించే భీష్మ ఏకాదశి ఏర్పాట్లను దేవస్థానం ఇఒ కె.రామచంద్రమోహన్ సమీక్షించారు. బుధవారం తన కార్యాలయంలో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ ఏకాదశి సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు వస్తారనే అంచనాలతో ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ సమావేశంలో వివిధ విభాగాలకు చెందిన అధికారులు, సిబ్బంది, పిఆర్ఒ కృష్ణారావు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల పోరాటం చరిత్రాత్మకం

ప్రజాశక్తి – పెద్దాపురం

తమ సమస్యల పరిష్కారం కోసం అంగనవాడీలు చేసిన 42 రోజుల పోరాటం చరిత్రాత్మకంగా నిలిచిపోతుందని సిఐటియు జిల్లా అధ్యక్షులు దువ్వా శేషబాబ్జి అన్నారు. బుధవారం స్థానిక యాసలపు సూర్యారావు భవనంలో ఎ.అమలావతి అధ్యక్షతన జరిగిన అంగన్‌వాడీల విజయోత్సవ సభలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం అంగన్‌వాడీలను అనగదొక్కాలని చూసిందన్నారు. అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని ఈ పోరాటం రుజువు చేసిందన్నారు.అనేక మందిపై కేసులు పెట్టినా బెదరలేదన్నారు. ఈ సభలో అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దడాల పద్మ, ఇ.చంద్రావతి, యూనియన్ నాయకులు దాడి బేబీ, అమల, ఎస్తేరు రాణి, కాలే దేవి, నాగమణి, సిఐటియు జిల్లా కార్యదర్శి బాలం శ్రీనివాస్, డి.క్రాంతి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దస్తావేజులు పోయినవి

బిక్కవోలు మండలం బిక్కవోలు గ్రామానికి చెందిన కోడూరి నాగలక్ష్మి W/o కోడూరి శ్రీనివాసరావుకు చెందిన బిక్కవోలు పంచాయతీ పరిధిలోని గ్రామా రెవెన్యూ తాలూకా సర్వే నెంబరు 348/3 డోర్ నెంబరు 11-10, 94 1/2 1/2 (471/4) ఖాళీ స్థలానికి సంబంధించిన దస్తావేజు నెంబరు 231/2004 ఒరిజినల్ దస్తావేజు బిక్కవోలు ఆంధ్రాబ్యాంక్ వీధిలో ఉన్న మా ఇంటి నుంచి ఆంజనేయ స్వామి గుడి వద్ద నుంచి వెళుతుండగా మార్గం మధ్యలో పడిపోయినవి. ఎవరికైనా దొరికిన ఎడల ఈ కింది అడ్రస్‌కు తెలియపరచగలరు.

కోడూరి నాగలక్ష్మి W/o కోడూరి శ్రీనివాసరావు,
బిక్కవోలు, బిక్కవోలు మండలం,
సెల్ 8008457457

ప్రత్తిపాడులో టిడిపి జెండా ఎగరాలి

ప్రజాశక్తి – శంఖవరం

రాష్ట్రంలో త్వరలో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో ప్రత్తిపాడు నియోజకవర్గంలో టిడిపి జెండా ఎగరవేయడమే లక్ష్యం కావాలని అమలాపురం నియోజకవర్గ టిడిపి పరిశీలకులు ముదునూరి మురళీకృష్ణంరాజు పిలుపునిచ్చారు. టిడిపి సీనియర్ నేత పర్వత సురేష్ స్వగృహంలో నాలుగు మండలాలకు చెందిన టిడిపి ముఖ్య నాయకులతో బుధవారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ప్రతీ గ్రామంలోనూ టిడిపి బలోపేతానికి, పార్టీ జెండాకు కట్టుబడి పనిచేస్తున్న కార్యకర్తల భరోసా కల్పించాలని చర్చించారు. ఈ సమావేశంలో పార్టీ నేతలు ఓలేటి లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

తుని పురపాలక సంఘం
"ఇ" ప్రొక్యూర్‌మెంట్ టెండరు నోటీసు

ఆర్ఓసి నెం.388/2017/ఇ1 తేది:07-02-2024

తుని పురపాలక సంఘము నందు సాధారణ నిధుల నుండి 18 పనులు చేపట్టి పూర్తి చేయుటకు "ఇ" ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారంపై టెండరు ఆహ్వానించడమైనది. సదరు టెండరుకు సంబంధించిన ఇతర వివరములు ది.09/02/2024 ఉదయం 11.00 నుండి WWW.apeprocurement.gov.in వెబ్‌సైట్‌లో చూడగలరు.

సంప్రదించవలసిన చిరునామా: కమిషనరు, తుని మున్సిపాలిటీ ఫోన్ నెం: 9849905806, 9849919375, 08854-253506 e-mail:tunimunicipality@gmail.com

సం/-ఎ.వెంకటరావు,
కమిషనరు, తుని పురపాలకసంఘం.

In the Court of the I Additional Junior Civil Judge, Tanuku
E.P. 42/2019, O.S. 348/2018

Between:
DHR: Raghamanda Srinu
JDR: Ryali Rama Krishna

DHR తరపున చేసిన వేలం ప్రకటన

యిందుమూలముగా యావన్మందికి పై కోర్టు వారి ఆదేశం తెలియజేయునది ఏమనగా, ఈ దిగువ ఉదహరించిన షెడ్యూలు ఆస్తిని **ది. 26-2-2024న ఉదయం గం॥ 10.30 ని॥లకు** గౌరవనీయులైన I Additional Junior Civil Judge, Tanuku వారి కోర్టు నందు బహిరంగ వేలము వేయబడును. కావున ఆసక్తి గలవారు పై తేదీన పై కోర్టు వారి షరతుల ప్రకారం వేలంలో పాల్గొనవచ్చునని ఈ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది.

షెడ్యూలు: పశ్చిమగోదావరి జిల్లా, సజ్జాపురం సబ్ రిజిస్ట్రీలో చేరిన ఉండ్రాజవరం మండలం, వడ్లూరు గ్రామపంచాయతీ ఏరియాలో వడ్లూరు గ్రామం తాలూకా రి.స. నెం. 245/3రు దాఖలా స్థలమున్నూ, యిందులోని డోరు నెం. 2-92 రు గల పెంకుటి యిల్లున్నూ, రేకుల షెడ్డున్నూ, ఆర్.సి.సి. బాత్‌రూమ్ వగైరాలకు ప్రతుల వారి వివరం.

1వ ప్రతి:
తూర్పు: 3వ ప్రతి ఉమ్మడి మార్గం అ. 24.8లు. **పడమర:** మరువాడ సుభారమేష్ వగైరాల సందు స్థలం అ. 24.8 లు. **ఉత్తరం:** 2వ ప్రతి అ. 24.9లు. **దక్షిణం:** పంచాయతి రోడ్డు అ. 24.9లు. *యీ హద్దులు మధ్య చ॥గ॥ 67.81 లు స్థలమున్నూ.*

2వ ప్రతి:
తూర్పు: కావలిపురపు బంగారయ్య గారి స్థలం అ. 42లు. **పడమర:** గొర్రెల సన్యాసిరావు, గొర్రెల సింహాచలం గార్ల స్థలం అ. 43.8లు. **ఉత్తరం:** పెన్మెత్స వెంకట సూర్యనారాయణరాజు గారి స్థలం అ. 33.3లు. **దక్షిణం:** 1, 3 ప్రతులు అ. 32.8లు. *యీ హద్దుల మధ్య చ॥గ॥ 157లు స్థలమున్నూ.*

3వ ప్రతి: ఉమ్మడి సందు మార్గమునకు
తూర్పు: కావలిపురపు వీరన్న స్థలం అ. 24.8లు. **పడమర:** 1వ ప్రతి అ. 24.8లు. **ఉత్తరం:** 2వ ప్రతి అ. 7.6లు. **దక్షిణం:** పంచాయతి రోడ్డు అ. 7.6లు.
యీ హద్దుల మధ్య చ॥గ॥ 20.55 లులో 1/3వ వంతు అనిర్దిష్టపు జాయింటు హక్కు గల చ॥గ॥ 6.85లు స్థలమున్నూ.

వెరశి మూడు ప్రతుల తాలూకు మొత్తం *చ॥గ॥ 231.66లు* స్థలమున్నూ, యిందులోని పెంకుటి యిల్లు, రేకుల షెడ్డు, ఆర్.సి.సి. బాత్‌రూమున్నూ, సమస్త యీజుమెంటు హక్కులతో.

DHR Value: Rs. 9,00,000/-
Amina Value: Rs. 13,50,000/-
Market Value: Rs. 11,34,118/-
JDR Value: Not known

M.SATYANARAYANA CHARI
Advocate, Tanuku
Cell: 9493480640